


త్వరగా ఎయిమ్స్ పనులు : ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 20 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 05

# హామ్ ఎక్స్‌ప్రెస్ టోల్‌ప్లాజా నిర్లక్ష్యం...

### కూలీల ప్రాణాలతో చెలగాటం

### యాజమాన్యంపై మండిపడుతున్న బాధితులు





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నార్కట్‌పల్లి అద్దంకి హైవేపై మాడుగులపల్లి మండల కేంద్రంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం టోల్ ప్లాజా యాజమాన్యం అట్టడుగు భద్రత ప్రమాణా లకు అద్దం పడుతుంది. హామ్ ఎక్స్‌ప్రెస్ టోల్ ప్లాజా పరిధిలో పనిచేస్తున్న కూలీల పై లారీ దూసు కెళ్లడంతో పలువురు కూలీలు గాయాల పాలయ్యారు.

**డబ్బు వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రాణాలపై లేదా?**

హైవేపై పనులు జరుగుతున్నప్పుడు కనీస భద్రత నియమాలు పాటించడంలో టోల్ ప్లాజా యాజమాన్యం పూర్తిగా విఫలమైందనే విమర్శల వ్యక్తమవుతున్నాయి. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు కాని, బారికేడ్లు గాని ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు వాపోతున్నారు. ప్రమాదం నేపథ్యంలో టోల్ ప్లాజా వద్ద పనిచేసే కార్మికులు స్థానికులు యాజమాన్యం ముందు డిమాండ్లు ఉంచారు. భద్రతకార్డులు విధి నిర్వహణలో ఉన్న ప్రతి కూలీకి అధికారికంగా భద్రత గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. పక్కా ఇన్సూరెన్స్ హైవేపై ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కూలీలందరికి హామ్ ఎక్స్‌ప్రెస్ యాజమాన్యమే ఇన్సూరెన్స్ ప్రీమియం చె ల్లించి బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలోని బాధితుల వైద్య ఖర్చులన్ని యాజమాన్యమే భరించాలని, భారీ నష్ట పరిహారం చెల్లించాలని, యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. టోల్ గేట్ల వద్ద ముక్కు పిండి వసూళ్లు చేసే టో ల్ ప్లాజా నిర్వాహకుల వద్ద పనిచేసే కూలీల ప్రా ణాలకు మాత్రం భద్రత కల్పించడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నారు. సరైన రక్షణ కవచాలు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఇన్సూరెన్స్ గ్యారెంటీ లేకపోతే పనులు నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నార. ప్రస్తుతం మిర్యాలగూడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీల పరిస్థితి విషమంగా ఉండడంతో పోలీసులు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన టోల్ ప్లాజా యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# హరీష్‌రావుకు మైండ్ బ్లాంక్ అయ్యింది..

### అందుకే మతిస్థిమితం లేని మాటలు

### ఎంపి చామల కిరణ్ రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల దెబ్బకు మాజీ మంత్రి హరీష్ రావు మైండ్ బ్లాక్ అయ్యి, మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. హరీష్ రావు లేఖల పేరుతో చేస్తున్నవన్నీ రాజకీయ డ్రామాలని, ఆయన చిల్లర మాటలను తెలంగాణ ప్రజలు అస్సలు పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో అస్తిత్వం, ఆత్మగౌరవం అనే మాటలకు అర్థమే లేకుండా చేశారని, ఇప్పుడు అవే పదాలతో పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నుంచి నేటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు 'గుండు సున్నా' మిగిల్చారని, ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకమైందని చామల గుర్తు చేశారు. ఢిల్లీలో క్యాబినెట్ మీటింగ్ జరుగుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఈ నెల 23వ తేదీన సెక్రటేరియట్లోనే క్యాబినెట్ భేటీ ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం పార్టీ వ్యవహారాలపై చర్చించేందుకే అధిష్టానం పిలుపు మేరకు రాష్ట్ర ముఖ్య నేతలు ఢిల్లీ వెళ్లారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో లాగా ఫామ్ హౌస్ పాలన తాము చేయడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు 24 గంటలూ ప్రజల కోసం పని చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, సోనియా గాంధీ వల్లే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని చామల పునరుద్ఘాటించారు. గత పదేళ్లలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని, రాష్ట్రాన్ని దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రజల్లోకి రాకుండా, అసెంబ్లీకి రాకుండా తనకు తాను శిక్ష వేసుకుని ఫామ్ హౌస్కే పరిమితమయ్యారని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల గురించి గత పదేళ్లలో ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. నిజాం ప్రభువులా పరిపాలన సాగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమ పార్టీ స్థితిగతులపై ఆత్మపరిశీలన చేసుకోవాలని చామల కిరణ్ రెడ్డి హితవు పలికారు.






# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ హెచ్చరిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పూర్తిగా చట్ట విరుద్ధమని,ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.గురువారం జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి ఛాంబరులో జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలో ఆడపిల్లల జననాల సంఖ్య తగ్గుదల నేపథ్యంలో లింగ నిర్ధారణ, లింగ వివక్షను అరికట్టేందుకు చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తామని తెలిపారు. అల్ట్రాసౌండ్ కేంద్రాలు చట్ట నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. లోపాలు గుర్తిస్తే సస్పెన్షన్ లేదా రద్దు వంటి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసిన అల్ట్రాసౌండ్ కేంద్రాల ఫైళ్లను సమీక్షించి అర్హత కలిగిన వాటికే అనుమతులు ఇవ్వాలని, గడువు ముగిసిన కేంద్రాల పునరుద్ధరణ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని కమిటీ నిర్ణయించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భనిరోధక మాత్రలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ చక్రవర్తి, గైకనాలజిస్ట్ డాక్టర్ జ్యోతి,డాక్టర్ సుచరిత,డాక్టర్ దీప,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ కృష్ణకుమారి,ఎన్‌జిఓ గీత పాల్గొన్నారు.

# నూతనంగా స్నిఫర్,ట్రాకర్ శునకాలు

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** జిల్లా పోలీసు విభాగానికి భద్రతా పరంగా మరింత బలాన్నిచ్చే విధంగా రెండు ఎక్స్‌ప్లోసివ్ గుర్తించే స్నిఫర్ బిట్టు,చింటూ శునకాలతో పాటు ఒక ట్రాకర్ సోను(శునకం) నూతనంగా చేరినట్లు జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ తెలిపారు.ఈ శునకాలు హైదరాబాద్ సమీపంలోని మోహినాబాద్ పోలీస్ డాగ్ ట్రైనింగ్ సెంటర్ లో ఎనిమిది నెలలపాటు ప్రత్యేక కఠిన శిక్షణను పూర్తి చేసుకున్నాయి. శిక్షణ సమయంలో ఎక్స్‌ప్లోసివ్ పదార్థాల గుర్తింపు, అనుమానాస్పద వస్తువుల తనిఖీ,నేరస్థుల అడుగుజాడల గుర్తింపు,గందరగోళ పరిస్థితుల్లో విధి నిర్వహణ వంటి అంశాలలో శునకాలకు ప్రావీణ్యం కల్పించబడింది.శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం డాగ్ హాండ్లర్లు కానిస్టేబుళ్లు ఫకృద్దీన్,సతీష్,దుర్గాప్రసాద్‌లు గురువారం నల్లగొండ జిల్లా ఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసి శిక్షణ విధానం,శునకాల సామర్థ్యాలు,ఫీల్డ్‌లో అవి పనిచేసే తీరు తదితర వివరాలను సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాల్లో ఇలాంటి శునకాలు అనేక క్లిష్టమైన కేసుల చేదనలో కీలక ఆధారాలను అందించాయని అన్నారు.అలాగే, స్నిఫర్ శునకాఖ్యంగా విఐపిల పర్యటనలు,భారీ ప్రజాసభలు,ఉత్సవాలు, జాతరలు, ప్రభుత్వ కార్యక్రమాలు ఎన్నికల సమయంలో ముందస్తుగా తనిఖీలు నిర్వహించడంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బి సీఐ రాము,అడ్మిన్ ఆర్ఐ సంతోష్,ఆర్ఎస్ఐలు సాయిరాం,సంతోష్,శ్రావణి, అశోక్, హెడ్ కానిస్టేబుల్ కరుణాకర్ తదితరులు ఉన్నారు.





## ప్లాస్టిక్ ఇస్త్రార్ల వాడకం ఆరోగ్యానికి హానికరం

**ప్రజాపక్షం/కోదాడ:** ప్లాస్టిక్ ఇస్త్రాల్లను విరివిగా వాడటం వల్ల పర్యావరణానికి, మనిషి ఆరోగ్యానికి పెనుప్రమాదమని పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు లక్ష్మి నారాయణ అన్నారు. గురువారం కోదాడలోని కనీసం అపార్ట్‌మెంట్ గెటెడ్ కమ్యూనిటీష్ సైనా ప్లాస్టిక్ విస్త్రార్లు, గ్లాసులను వాడి ఆరోగ్యాన్ని పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. వివిధ హానికర రసాయనాలతో తయారు చేసే ప్లాస్టిక్ విస్త్రార్లను వేడి వేడి ఆహార పదార్ధాలను తినటం వల్ల మనిషి ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన దోతిగూడెం సర్పంచ్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి దోతి గూడెం సర్పంచ్‌గా ఎన్నికైన యాట జంగయ్య గురువారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిఆర్‌ఎస్ పార్టీతో గెలిచిన 2వ, 3వ, 6వ వార్డు సభ్యులు ముద్దం నిర్మల మల్లయ్య, ఎలమొని అంజయ్య, సొప్పరి సత్తయ్యలతో సహా 50 మంది ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ చేరికల కార్యక్రమంలో ముద్దం శేఖర్, గుర్రం సత్యపాల్ రెడ్డి, అంతమ్మగూడం ఉపసర్పంచ్ బండ మురళి, లింగస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామూహిక సీమంతం

**ప్రజాపక్షం/అర్వపల్లి** : ప్రభుత్వ ఆసుపత్రిలో సహజ కాన్పు కొరకు అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నగేష్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గాజుల చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సహజ కాన్పు కోసం అన్ని రకాల వసతులు కల్పించినట్లు, సహజ కాన్పు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, ఆపరేషన్ నిర్వహించినట్లయితే వారికి అనేక అనర్థాలకు దారితీస్తాయని, సహజ కాన్పు వల్ల ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా ఉపయోగముంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రసిద్ధ, నాజియా, భూక్యా నగేష్ నాయక్, సిబ్బంది ఉమా, సంజీవరెడ్డి, మాలోతు బిచ్చునాయక్, మంగ పాల్గొన్నారు.



## మున్సిపల్ ఛైర్మన్‌గా బిసి మహిళకు అవకాశం కల్పించడం పట్ల హర్షం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్‌గా బీసీ మహిళకు అవకాశం కల్పించడం పట్ల బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిలాలలో 17 మున్సిపల్ ఛైర్మన్‌లకు గాను బీసీలకు కాంగ్రెస్ పార్టీ 50శాతం మున్సిపల్ ఛైర్మన్లుగా అవకాశం కల్పించిందని, గతంలో ఎన్నడూ లేని బీసీలు పెద్ద ఎత్తున విజయం సాధించారని అన్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని మాకు రావాల్సిన వాటా కోసం మాత్రమే మేము ఉద్యమిస్తున్నామని అన్నారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ,



జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా బీసీలకు జనరల్ స్థానాల్లో అవకాశం ఇవ్వాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దొనేటి శేఖర్, గుండు నరేందర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కుంకుడుతో స్వయం ఉపాధి అవకాశాలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో కుంకుడుకాయ సాగు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించేందుకు గురువారం కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో ముగింపు శిక్షణ కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించినట్లు కెవికె గడ్డిపల్లి శాస్త్రవేత్త నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కుంకుడుగాయ పంట రైతులకు స్థిరమైన , లాభదాయకమైన ఆదాయ వనరుగా మారగలదని తెలిపారు. ఈ పంట సాగుకు తక్కువ ఖర్చుతో పాటు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని, కుంకుడు గాయ పోడి, షాంపులు, సబ్బులు, ఇతర సహజ ఉత్పత్తుల తయారి ద్వారా రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, స్వయం ఉపాధి అవకాశాలు, చిన్న స్థాయి ప్రాసెసింగ్‌యూనిట్ల స్థాపన ద్వారా మహిళ ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి సీనియర్ సైంటిస్ట్, హెడ్ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ రైతులు సమూహాలుగా ఏర్పడి ఉత్పత్తులను మార్కెట్ చేస్తే మరింత లాభాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సుగంధి, ఎ.నరేష్, రైతులు పాల్గొన్నారు.

## న్యాయవాదులు విధుల బహిష్కరణ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో గురువారం న్యాయవాదుల తమ విధులను బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ నల్గొండ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాది నరేష్ కుటుంబ సభ్యులపై కొందరు దుండగులు దాడి చేసి అతన్ని, కుటుంబ సభ్యులను కొట్టి గాయపర్చటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల బౌతిక దాడులను, హత్యలకు పాల్పడటం పరిపాటి అయిందని అటువంటి చర్యలు న్యాయ వ్యవస్థకే గొడ్డలిపెట్టు అన్నారు. న్యాయవాదులపై వరుస దాడులు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాస రావు, చెనగాని యాదగిరి, ఎంఎస్ రాఘవరావు, ఉప్పుల గోపాలకృష్ణమూర్తి, జక్కుల వీరయ్య, కమతం నాగార్జున, వట్టికూటి అంజయ్య, కొట్టు సురేష్, సాముల సురేందర్‌రెడ్డి, పాలేటి శ్రీనివాస రావు, పిడమర్తి చంద్రయ్యపాల్గొన్నారు.

## విద్యార్థుల రీడింగ్, రైటింగ్ స్కిల్స్‌పై జిల్లా బృందం పరిశీలన

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండలంలోని ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థుల రీడింగ్ రైటింగ్ స్కిల్స్ పై జిల్లాస్థాయి బృందం నోడల్ అధికారి వెంకట్రాం నాయక్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం త్రిపురారం పెద్దదేవులపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలల ప్రార్థన సమయం మధ్యాహ్న భోజనం తరగతి గదుల నిర్వహణ పలు అంశాలను పరిశీలించారు.మరుగుదొడ్లు వంట గదుల నిర్వాణ ల్యాబ్ ఫర్నిచర్ ఆటపాటల వంటి అంశాలను పరిశీలించారు.పాఠశాలలో మానిటరింగ్ చేసి విద్యార్థుల నమోదుకు డిజిటల్ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.అనంతరం మండల విద్యాధికారి రవి నాయక్ సమక్షంలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి తగు సలహాలు సూచనలు అందించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హనుమాన్ నాయక్,వెంకటేశ్వర్లు, శివశంకర్,రామ,నర్సయ్య,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ శాఖ ప్రజాబాట

**ప్రజాపక్షం/అర్వపల్లి** : విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాబాట ద్వారా గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాబాటలో భాగంగా విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను గుర్తించారు. తమ గ్రామంలో ఏర్పడిన విద్యుత్ సమస్యలను అధికారులు త్వరగా పరిష్కారం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్, నాయకులు పొట్టెపాక సైదులు, రేఖల సైదులు, కర్నాటి మురళి, వార్డు సభ్యులు మర్రి లతీఫ్ పాల్గొన్నారు.





## కార్యకర్త కుటుంబానికి పటేల్ అండ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అండగా నిలిచారు. రూ. లక్షల ఆర్థికంగా సహాయం ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... సీనియర్ కాంగ్రెస్ నాయకులు ధరావత్ ధర్మ నాయక్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుమార్తెల భవిష్యత్తు విద్యా అవసరాల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డిసిసిబి మాజీ డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

## పాఠశాల, కళాశాల తనిఖీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని గాయత్రీనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను గురువారం సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్‌అమిత్ ఆదేశాలతో మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్ అధికారుల బృందం తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాల భవనం వృధా నీటి పైపులు లీక్ కావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి సంబంధిత భవనం యజమానికి రిపేర్ల కోసం చెప్పాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. దోమల బెడద ఉందని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా విద్యార్థుల భోజనం పరిశీలించారు. అన్నం మొత్తబడిందని విద్యార్థులు పేర్కొన్నారు. కొత్త బియ్యం కావడం వల్ల మెత్తబడిందని బియ్యం మార్చాలని విద్యార్థులు కోరారని అధికారుల బృందం సబ్ కలెక్టర్ అమిత్‌కు నివేదించారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అంగన్‌వాడీ సెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే పౌష్టికాహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉండవచ్చని కాంగ్రెస్ జిల్లా నాయకులు పోలగాని బాలు గౌడ్, కౌన్సిలర్ బోలగాని వీణ సురేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 21వ వార్డు జమ్మిగడ్డ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమంను వారు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మూడు సెంటర్ల విద్యార్థులకు పలకలను సొంత నిధులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికై మొదటి సారి వచ్చిన కౌన్సిలర్ వీణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గాలి ప్రవీణ, బాణాల పద్మ, జిల్లా శశికళ, సాలేహ, మంగ, లలిత, శకుంతల, శ్రీవిద్య, బైనబాయి పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/నూతనకల్** : జీవిత భీమా కుటుంబానికి అండగా ఉంటుందని స్థానిక ఎస్ఐ నాగరాజు అన్నారు. మండల కేంద్రానికి చెందిన షేక్ అబ్దుల్లా ఇటీవల మృతి చెందాడు. మృతుడు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా కలిగి ఉన్నాడు. గురువారం మృతునికి మంజూరైన రూ.3,54,096 భీమా చెక్కును మృత్తిని భార్య షేక్ అప్సరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, మిర్యాల సర్పంచ్ అనంతుల శీను, వరంగల్ డిజిఎం గంగుల సతీష్, డిఎం భరత్, కృష్ణ, లోకేష్ పాల్గొన్నారు.



## రేషన్ దుకాణం మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని అలుగునూరు గ్రామానికి రేషన్ దుకాణాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ కాసా నరేందర్ అధికారులను కోరారు. గురువారం గ్రామానికి రేషన్ దుకాణాన్ని మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి తహశీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో లబ్ధిదారులు ఇక్కట్లకు గురవుతున్నారని అధికారులు వెంటనే స్పందించి రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోరంట్ల వెంకన్న, ఇటికాల ప్రసాద్, బంటు యాదగిరి, పాడేటి సతీష్ పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి మండల పరిధిలోని నిర్వహించేటువంటి ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు, రంజాన్ పండుగ సందర్భంగా నిర్వహించే నమాజ్ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలకు, ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ అజ్మీరా రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఊట్కూరి వేమన్ రెడ్డి, బొడిగె సాంబశివగౌడ్, కేసాని లింగారెడ్డి, కొడిదాల వెంకటయ్య, ఏరుకొండ రాము, దస్రునాయక్, చంద్రమౌళి, మౌలానా నజీర్, కబీర్, హబీబ్, ఎలిమినేటి సాయి, నీల విజయ్, కూన భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/హాలియా:** అనుముల పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో కలెక్టర్ గా సునీత, డీఈవోగా శిల్ప,మండల విద్యాధికారిగా మేఘన,పాఠశాలప్రధానోపాధ్యాయులుగా సిద్ధు,వివిధ హోదాలను చక్కగా విధులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు,ఉపాధ్యాయులు మధు,విజయలక్ష్మి,యశోద మమత,సత్యనారాయణ,యమునా తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలింపు

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామంలో చిన్నేరువాగులో నుంచి అక్రమంగా ఇసుకను కొంత మంది వ్యక్తులు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి తీసిన ఇసుకను ఇతర గ్రామాలకు బయటకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఓటి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేసి ఒక జెసిబి, రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. దింతో నమ్మ దగ్గిన సమాచారం మేరకు పోలీస్‌లు దాడులు చేసి జేసీబీని సిజ్ చేసినట్లు చెప్పారు.



# రామన్నపేటలో ఘనంగా శివాజీ శోభాయాత్ర శంకుస్థాపన కార్యక్రమం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మల్లికార్జున బిన్నీ రైస్ మిల్ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జీజాబాయి వేషధారణలతో అందరినీ అబ్బురపరిచారు. తదుపరి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు కొరకై కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా సర్పంచ్ గరిక సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్లుగా జినుకుల ప్రభాకర్, కాంపాటి యాదగిరి, బాసిరాజు అశోక్ గౌరవ సలహాదారులుగా ప్రముఖ గ్రామ పెద్దలను ఎన్నుకోగా, అధ్యక్షుడుగా చొల్లేటి శివ కిరణ్, ఉపాధ్యక్షులుగా బాసాని రాజు, వావిళ్ళ సంతోష్, దావనూరు అజయ్, ప్రధాన కార్యదర్శిగా ఏనూతుల సురేష్, కల్లూరి నరేష్, బట్టె సంతోష్, కార్యదర్శులుగా దావనూరు శివ, గొరిగె నరేష్, దొంత నాగరాజు, పిట్టల మహేష్, నామనంది వినయ్, గండికోట రాకేష్, కోశాధికారులుగా కైరంకొండ సంతోష్ కుమార్, అలిసేరి వంశీ, ఉప కోశాధికారులుగా సాల్వేర్ ప్రవీణ్, చెరుకు ఉపేందర్, ట్రెజరీ రికార్డర్‌గా అలిసేరి కళ్యాణ్, సోషల్ మీడియా సభ్యులుగా వర్గాల నితిన్, వికాస్, నరేష్‌లను ఎన్నుకున్నారు.



# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



**ప్రజాపక్షం/హాలియా:** ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమి ఆరోగ్యంగా ఉండడంతో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి వెంకన్న అన్నారు.గురువారం మండలంలోని రామడుగు గ్రామంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫామింగ్ (ప్రకృతి వ్యవసాయం)లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎం.వెంకన్న మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వలన నేల,ప్రకృతి ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా మనిషి ఆరోగ్యం కూడా బాగుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం లో ఎంపిక చేయబడిన గ్రామం నుంచి ఇద్దరు కృషి సఖీలు వ్యవసాయ శాస్త్రవేత్తల చేత శిక్షణ పొందిన తమ గ్రామంలో 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలో సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామడుగు సర్పంచ్ మజ్జిగపు నర్సిరెడ్డి, చింతగూడెం సర్పంచ్ తగుల అంజయ్య, ఉపసర్పంచులు,వార్డ్ మెంబర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి వి దుర్గాభవాని, రైతులు పాల్గొన్నారు.

# కొబ్బరికాయల వేలం పాట రూ.4.20 లక్షలు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని టిపి గౌరారం గ్రామ పరిధిలో ఉన్న చలివోన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం సమీపంలో గురువారం నిర్వహించిన కొబ్బరికాయల వేలంపాట ఉత్సాహభరితంగా సాగింది. గ్రామానికి చెందిన నెల్లికంటి కృష్ణయ్య రూ.4,20లక్షలకు దక్కించుకున్నారు.వేలంపాట అనంతరం ఆయన రూ.2,30లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించగా,మిగిలిన రూ.1,90లక్షలు స్వామి వారి తలంబ్రాల నాడు చెల్లించాలని దేవాలయ కమిటీ నిర్ణయించింది.వేలంపాటలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ వట్టికోటి రవి మాట్లాడుతూ, వేలంపాట ద్వారా వచ్చిన నిధులను ఆలయ మరమ్మతులు,విద్యుత్ దీపాల ఏర్పాటు,శుద్ధి నీటి సదుపాయం,భక్తుల సౌకర్యాల కోసం వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి జల్లెపల్లి జయరామయ్య,ఆలయ కమిటీ సభ్యులు కదారి వెంకటయ్య,భట్టు రవీందర్,వేలంపాట దారులు, గ్రామ పెద్దలు, భక్తులుపాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి దేవాలయానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండల పరిధిలోని అబిద్ నగర్ గ్రామపంచాయతీ మధిర నిమ్మబావిలో పోచమ్మ తల్లి దేవాలయంకు గురువారం మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సంగు బుచ్చమ్మ, సాయిరెడ్డి జనార్ధన్ రెడ్డిల కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్ర మంలో మాజీ జెడ్పిటిసి పల్ల వెంకట్ రెడ్డి, సర్పంచ్ నాయిని అమరావతి రామ చంద్రారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు



బొట్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్, ఆలేరు సింగిల్ విండో డైరెక్టర్ బీస కృష్ణంరాజు, ఎర్ర మల్లేశం, గ్రామ పెద్దలు, నూతనంగా గెలు పొందిన వార్డు సభ్యులు, బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్ కార్యక్రమం ప్రారంభం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఈనెల 21న సాయి కన్వెన్షన్ హాల్లో ఐఏఎస్, ఐపీఎస్ ప్రోగ్రాం ప్రారంభం జరుగుతుందని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డా॥ పగిడాల జలంధర్ రెడ్డి తెలిపారు. గురువారం భువనగిరిలోని విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులుగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, అదనపు జిల్లా కలెక్టర్ భాస్కరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అవేస్ చిస్తి, డీఈవో సత్యనారాయణ, స్వర్ణగిరి ట్రస్ట్ చైర్మన్ రామారావు, ప్రధాన వక్తగా సుద్దాల అశోక్ తేజ, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్ పాల్గొంటున్నారని తెలిపారు.

## తరగతి గదులే దేశ భవిష్యత్తుకు పునాదులు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** విద్యార్థులే ఉపాధ్యాయులై స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలను పోషించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. జిల్లా కలెక్టర్‌గా, డిఈఓగా, ఎంఈఓగా, హెచ్ఎంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి పాల్గొని మాట్లాడుతూ తరగతి గదులే దేశ భవిష్యత్తుకు పునాదులు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఎడవెల్లి సతీష్, హెడ్‌మాస్టర్ ఆర్ సునీత, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బసవ లింగేశ్వర స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం, గుంటూరు గ్రామంలోని శ్రీ బసవ లింగేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారి కళ్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో దంతూర్ సర్పంచ్ గోరుగంటి సువర్ణ రవీందర్, శివాలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకటరెడ్డి రమాదేవీ, ఉప సర్పంచ్ బింగి పూజ శివ కుమా ర యాదవ్, వడ్డెర సంఘం యాదాద్రి జిల్లాప్రెసిడెంట్ బోదాస్ చిన్న ఈదయ్య, వార్డ్ సభ్యులు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం/వలిగొండ :** భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్‌గా తంగళ్ళపల్లి రవి శ్రీవాణి నూతనంగా ఎన్నికైన తర్వాత మొదటిసారి వలిగొండకు వచ్చిన సందర్భంగా వలిగొండ మండల బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోళ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దయ్యాల శ్రీశైలం, తెలంగాణ ఉద్యమకారులు శీలం స్వామి, పబ్బు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.






## వార్డు సభ్యులు గ్రామాలు అభివృద్ధి కోసం కృషి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎన్నికైన సభ్యులు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా కార్య నిర్వాహన అధికారి ఎన్.శోభారాణి కోరారు. గురువారం బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మొదటి విడతశిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీ చట్టం ప్రకారం విధులు నిర్వహించాలని, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసి ప్రజల గుర్తింపు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై.శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రంలో గల అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగళి రెడ్డి ఫోటోల శ్యామ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ శ్యామల కిరణ్ కుమార్ రెడ్డినీ కోరారు. గురువారం ఎయిమ్స్ ఆస్పత్రిలో జరిగిన కమిటీ సమావేశానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఉపసర్పంచ్ గోలి నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి గోలి నరేందర్ రెడ్డి, పంజాల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామల ప్రవీణ్ రెడ్డి, సోమశివకుమార్, రాళ్ల బండి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ :** యరుగండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నేరుగా కూలీలను కలిసి పనుల ప్రాముఖ్యతను వివరిస్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి కల్పనకై జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని వివరించారు.పని ప్రదేశాలలో ఎదురవుతున్న సమస్యలు,వాటి పరిష్కారం గురించి తెలుసుకున్నారు. వీరి వెంట పంచాయతీ సెక్రటరీ శ్రవణ్, ఫీల్డ్ అసిస్టెంట్ వల్లంల శ్రీశైలం,ముత్తు ఉన్నారు.



# పలివెలలో తెలుగు ఉపాధ్యాయుడు నియామకం

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చొరవ... విద్యార్థి సంఘాల ఆందోళన ఫలితం

### హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు




**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని పలివెల ఉన్నత పాఠశాలలో గత కొన్ని నెలలుగా తెలుగు ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో తెలుగు పాఠాలు నిలిచిపోవడం ఆందోళనకు దారితీసింది.ఈ సమస్యపై స్పందించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు పాఠశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు.వెంటనే తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ మండల విద్యాధికారిని పాఠశాల గదిలో నిరసనగా బంధించి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెంటనే స్పందించారు.జిల్లా కలెక్టర్,జిల్లా విద్యాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పలివెల గ్రామంలో తెలుగు ఉపాధ్యాయుడి ఖాళీని తక్షణమే భర్తీ చేయాలని ఒత్తిడి తెచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధం ఉన్న అంశమని, ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.దీనితో విద్యా శాఖ అధికారుల్లో చలనం ఏర్పడింది. ఎమ్మెల్సీ చొరవతో స్పందించిన అధికారులు గురువారం పలివెల ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు బాధ్యతలు స్వీకరించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు,నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థి సంఘ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇకపై పాఠశాలలో ఎలాంటి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు.విద్యార్థి సంఘాలు కూడా మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని,అవసరమైతే మరిన్ని సమస్యలపై కూడా ఆందోళనలు చేపడతామని హెచ్చరించాయి.పలివెలలో తెలుగు ఉపాధ్యాయ నియామకం విద్యార్థుల ఐక్యతకు,ఎమ్మెల్సీ చొరవకు నిదర్శనంగా నిలిచింది.

## న్యాయవాదుల ధర్నా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండలో న్యాయవాది జి.నరేష్ ఇంటిపై దాడికి నిరసనగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం సముదాయంలోని నాలుగు కోర్టుల విధులను బహిష్కరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాది నరేష్ ఇంటి మీద దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించాలన్నారు. ఒక కేసులో ముద్దాయి తరుపున వాదిస్తున్న లాయర్ ఇంటిపై దాడి చేసి ఇంటిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి అడ్డువచ్చిన భార్య పిల్లలపై పాశవికంగా దాడి చేసి కొట్టి భయభ్రాంతులకు గురి చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠినమైన కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం తెచ్చి దాడులకు పాల్పడే వారిని ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా వెంటనే శిక్షించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు సుండి శ్రీనివాస్, గొడ్డటి సాయికుమార్‌యాదవ్, కర్ణం లింగయ్య, ప్రభాకర్, శ్రీధర్‌గౌడ్, పుల్లారెడ్డి, పద్మయ్య, నాగేందర్, స్వరాజ్యం, మట్టయ్య, రాజేందర్‌నాయక్, భాస్కర్, మల్లేష్, వీరేంద్రనాయుడు, కిరణ్, బాలునాయక్, రాము, మంద సైదులు, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మౌళిక సదుపాయాలతో గుణాత్మక విద్య



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించినప్పుడే విద్యార్థులు బోధనపట్ల ఆసక్తి పెంచుకొని గుణాత్మక విద్యను పొందుతారని మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు ప్రముఖ న్యాయవాది ఎం శైలజ ఈశ్వర్ కుమార్ త్రిశక్తి మహిళా గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం మూత్రశాలలు, మరుగుదొడ్లు, భవన ఆధునీకరణ కోసం రూ.3లక్షల ఆర్థిక సహాయంతో నిర్మాణం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల అభ్యున్నతికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపకళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, కాంగ్రెస్ నాయకులు ఏ రవి బాబు, అర్చకులు వేణుగోపాలాచార్యులు, మురళీధర ఆచార్యులు, త్రిశక్తి వనిత అధ్యక్షురాలు పసుమర్తి జ్యోతి కృష్ణమూర్తి, గుండా రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలం రహీంఖాన్ గూడలోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వార్ల కళ్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో చూడ చక్కగా అలంకరించిన ముత్యాల పంధిరిలో వేద పండితులు శ్రీనివాస శర్మ, అరుణ్ శర్మ మంత్రోచ్ఛారణాలతో శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ తంతు జరిపారు. అనంతరం దేవతా మూర్తులను రథం పై ప్రతిష్టించి డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ పంజాల విజయ్ కుమార్ గౌడ్, సర్పంచ్ నవ్వ శ్రుతి అరవింద్, ధర్మకర్త అంది రాజేందర్, ఉప సర్పంచ్ మంచాల ప్రభాకర్ పాల్గొన్నారు.



## ఎసిఎఫ్ ప్రత్యేక హెల్త్ క్యాంప్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న యాక్టివ్ కేస్ ఫైండింగ్స్ (ఏసిఎఫ్) కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. ఇటీవల డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌లో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా నోడల్ అధికారి డిటిసిఓ డాక్టర్ వంశీకృష్ణ హాజరై గ్రామ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. క్యాంప్లో భాగంగా గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స ర్పంచ్ ర్యాకల సంతోష్రశీనివాస్, ఉప సర్పంచ్, వా ర్డు సభ్యులు, ప్రభుత్వ వైద్య బృందం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## 3వ రోజు శిక్షణలో డిండి మండల సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/డిండి;** నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు శిక్షణలో భాగంగా 3వ రోజు గురువారం నల్గొండ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ రాజ్ ఆఫీసర్ హాజరై సర్పంచ్ విధులపై అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్‌లతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈకార్యక్రమంలో డిండి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, శాంతిగూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డితో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 39వ బ్రహోత్సవాలు

**ప్రజాపక్షం/డిండి;** నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని డిండి మండలం దాసరి నెమలిపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థాన 39వ బ్రహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. భానునెల 19 నుండి 23 వరకు జరగనున్న ఈ బ్రహోత్సవాల్లో మొదటి రోజు గురువారం స్వామివారి అధ్యాయ దినోత్సవం, 20వ తేది శుక్రవారం అంకురారోహణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించడం జరుగుతుందని . 21వ తేది శనివారం ఉదయం 11.30లకు శ్రీ పద్మావతి శ్రీనివాసుల కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహిచండం జరుగుతుందని, 22 ఆదివారం సామూహిక వ్రతాలు, 23 సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు బ్రహోత్సవ రథోత్సవం అనంతరం 8 గంటలకు పూర్ణాహుతి, అపబృత స్నానం, రాత్రికి ఏకాంత సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

## ఎన్‌జి కళాశాలలో విస్తృత ఉపన్యాసం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సాంప్రదాయ పద్ధతులను వదిలేసి ఆధునిక పద్ధతులు అనుసరించడం వల్ల ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలన శాఖ అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ గీతా నాయక్ విస్లావత్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు అధ్యక్షతన ప్రభుత్వ పాలన విభాగశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసాన్ని చేశారు. ఈవిస్తృత ఉపన్యాసానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలన శాఖ అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ గీతా నాయక్ విస్లావత్ పాల్గొని మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలో భాగంగా సాంప్రదాయ పద్ధతులను వదిలేసి ఆధునిక పద్ధతులు అనుసరించడం వల్ల ఆర్థిక అభివృద్ధి జరిగి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మారుతుందన్నారు.ఈకార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ డాక్టర్ మునిస్వామి , అకాడమిక్ కోఆర్డినేటర్ బత్తిని నాగరాజు, చరిత్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ బట్టు కిరీటం,రాజనీతి శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ అదే మల్లేశం పాల్గొన్నారు.



# భారతీయ పౌరుషానికి నిలువెత్తు నిదర్శనం శివాజీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను గురువారం అంబేద్కర్ యూత్ అధ్యక్షులు అమరారపు శివాజీ, బండారు విజయ్ ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాంద్‌మియా, పిడమర్తి హుస్సేన్, పిడమర్తి అంజి, బండారు బిక్షం, సైదులు, గురుస్వామి, వెంకట్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం ):** ధైర్యానికి, దేశభక్తికి, ధీరత్వానికి మారుపేరుగా నిలిచిన మహనీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన మండలి అధ్యక్షులు మజ్జిగ నరేశ్, ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దేవరకొండ;** శివాజీ మహారాజ్ ధైర్యం, దేశభక్తి, స్వరాజ్య స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని బిఆర్‌ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ర్యాలీని ప్రారంభించారు.



**ప్రజాపక్షం/మర్రిగూడ :** ఛత్రపతి శివాజీ జయంతిని శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,ఓబీసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.శివాజీ ధైర్యాన్ని,ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ప్రజాపక్షం/హాలియా :** ఆర్యక్షత్రియ సంఘం, ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ




396వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం హాలియా పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యువకులు పెద్ద ఎత్తున పుర వీధుల్లో శోభయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షులు ముజ్జా శివరామయ్య, గౌరవ అధ్యక్షులు ముజ్జా శ్రీహరి, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు చిందే లక్ష్మణ్ రావు, గౌరవ అధ్యక్షులు గాయాకవాడ శివన్నారాయణ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి,హాలియా మున్సిపల్ ఛైర్మెన్ చింతల చంద్ర రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ 396వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. అంగడి బజార్ వేణుగోపాల స్వామి ఆలయం నుండి నాంపల్లి సర్పంచ్ నక్క చంద్రశేఖర్ ప్రారంభించారు.



## చందుపట్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిలిపివేత

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని చందుపట్ల సబ్‌స్టేషన్ పరిధిలో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి 8 ఎంవీఏ సామర్థ్యంతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఇంచార్జి ఏఈ ఎన్.రంజిత్‌కుమార్ తెలిపారు.ఈనేపథ్యంలో ఫిబ్రవరి 20న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చందుపట్ల,మండలాపురం,కందిమల్లవారి గూడెం, పాదురి గూడెం,కొత్తవారిగూడెం, ఇనుపాముల,రాయపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నవ్య చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్ పట్టణంలో తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిభిరం నిర్వహించారు.ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పులిగిల్ల అభిరామ్,పులిగిల్ల సురేష్, విష్ణు,విరాట్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** సామాజిక స్పృహతో, మానవతా దృక్పథంతో వైద్య సేవలందిస్తున్న పవన్ సాయి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్‌ను గురువారం ప్రముఖులు ఘనంగా సన్మానించారు.ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి, నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాకీ వెంకటయ్య ,డాక్టర్‌ను శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ పేదలకు అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్న శ్రీనివాస్ గౌడ్ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



# మహిళల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలంటే మహిళా సమాఖ్య సంఘాలు కీలకమని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.గురువారం మండలంలోని గోరెంకలపల్లి,మర్రూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించే మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సమావేశాలు,శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు సొంత భవనాలు అవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తన



వంతు కృషి చేస్తానన్నారు.మహిళల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింగు ఎల్లయ్య, నర్సింగు సరిత శ్రీనివాస్,ఉపసర్పంచ్ చెట్టుపల్లి జగన్,ఏపిఎం ప్రభాకర్, మాజీ సర్పంచ్ నకరికంటి నరేందర్ పాల్గొన్నారు.

## కనుకుల వెంకటరెడ్డి మృతికి పలువురు సంతాపం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నోముల గ్రామానికి చెందిన కనుకుల శ్రీనివాసరెడ్డి తండ్రి కనుకుల వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్,బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్న రాజ్ వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారి వెంట సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, స్థానిక సర్పంచ్ పోట్ట బత్తుల జయమ్మ వెంకటేశం,బిఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్ ,ఉపసర్పంచ్ కోమటిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి,వివిధ పార్టీల నాయకులు



కుంచం సోమయ్య, యాస కరుణాకర్ రెడ్డి, సామ రవీందర్ రెడ్డి, కే. శ్రీధర్ గుండ గోని జంగయ్య గౌడ్, ఎల్మకంటి జానయ్య, బాదిని యాదయ్య తదితరులు ఉన్నారు.

## తుర్కపల్లిలో బిఆర్‌ఎస్ ధర్నా

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన యూరియా యాప్ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పాత పద్ధతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రైతుల ఖాతాల్లోకి రైతుబంధు వేయాలని తుర్కపల్లి మండలంలో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, పరమేష్ యాదవ్, మాజి ఎంపీపీ రవీందర్ నాథ్ గౌడ్, సర్పంచ్ సీత రాజు పాల్గొన్నారు.



## మేయర్‌ని కలిసిన యాదవ కార్పొరేటర్లు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డిని గురువారం ఆయన నివాసంలో యాదవ కార్పొరేటర్లు తో రాష్ట్ర యాదవ ఉద్యోగుల సంఘం,సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బొమ్మల గోపాల కృష్ణ యాదవ్,నలగొండ యాదవ కార్పొరేటరులు అల్లి సుభాష్ యాదవ్,గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్,గోగుల గణేష్ యాదవ్,అల్లి మల్లికార్జున్ యాదవ్,వజ్జ రమేష్ యాదవ్,సదర్ ఉత్సవ సమితి,జిల్లా అధ్యక్షులు మద్ది శ్రీనివాస్ యాదవ్,గజ్జి అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని రామలక్ష్మి పురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం 1, ప్రాథమిక పాఠశాలను గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి తులిశమ్మ కన్నారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న భోజనం, బాలామృతం, కోడి గుడ్లు, పాలు తదితర పౌష్టికాహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, పరిమాణం, పరిశుభ్రత అంశాలను పరిశీలించిన సర్పంచ్ పిల్లల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నెం పాపిరెడ్డి, ఉప సర్పంచ్ సీతారాములు, వార్డు సభ్యులు వెంకటరమణ, గ్రామపెద్దలు రాంరెడ్డి కొండలు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్ స్వరాజ్యము పాల్గొన్నారు.

## అజయ్ కుమార్ రెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/నకిరేకల్:** జాతీయ మత్స్య దినోత్సవం సందర్భంగా,పర్చూరు అజయ్ కుమార్ రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి,నల్లగొండ జిల్లా కలెక్టర్,ఎస్‌పి చేతుల ద్వారా 2018లో రాష్ట్ర ఉత్తమ చేపల రైతు అవార్డు,2025లో బెస్ట్ ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డు,తెలంగాణ రైతు రత్న అవార్డులు అందుకున్న సందర్భంగా బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్న రాజ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో జోగు అశోక్,పోలపల్లి సత్యనారాయణ,చెరుకు వెంకటాద్రి,బొంబాయి నరసింహ, ఉయ్యాల నరసింహ,దోసపాటి శంకర్,పానుగుల్ల,యాదగిరి,కొమ్మనపల్లి ఉషయ్య తదితరులు పాల్గొన్నారు.

## మురుగుకుంట మాయం

**ప్రజాపక్షం/మర్రిగూడ** :మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లే దారిలో పేరుకుపోయిన మురుగు నీటి కుంటను సర్పంచ్ వీరమళ్ల శిరీష బుధవారం పూడ్చివేయించారు.వాహనదారులు,బాటసారుల ఇబ్బందులను గమనించి స్పందించిన ఆమె కల్వర్టు ద్వారా నీరు బయటకు వెళ్లేలా పైపులు వేయించి,మట్టితో రోడ్డును చదును చేయించారు.సమస్యను పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

